సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం ၊ 21 ၊ మే ၊ 2025



మాతృదేవోభవ..
మాతృదేవోభవ-పితృదేవోభవ స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది. - 8లో



సౌరశక్తి వినియోగంతో..
సౌరశక్తి వినియోగంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36°/25°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాలువ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

భువనగిరిటౌన్ : బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలపై మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రివ్యూ సమావేశం నిర్వహించారు. కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

22న భాగ్యరెడ్డివర్మ జయంతి

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో ఈనెల 22న భాగ్యరెడ్డివర్మ జయంతి వేడుకలను షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి ఇన్‌చార్జ్ అధికారి వసంతి కుమారి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తహసీల్దార్ల నియామకం

భువనగిరిటౌన్ : గతంలో ఎన్నికల సమయంలో వేరే జిల్లాలకు బదిలీ అయిన తొమ్మిది మంది తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాకు రాగా.. వారికి పోస్టింగ్ ఇవ్వడంతోపాటు, మరో ఇద్దరిని బదిలీ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి మండలానికి అంజిరెడ్డి, బీబీనగర్ మండలానికి శ్యాంసుందర్ రెడ్డి, వలిగొండ దశరథ, పోచంపల్లికి శ్రీనివాస్ రెడ్డి, యాదగిరిగుట్ట గణేష్, ఆలేరు మండలం ఆంజనేయులు, గుండాలకి హరికృష్ణ, మోత్కూర్ జ్యోతి, చౌటుప్పల్‌కు వీరాబాయిని బదిలీ చేశారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్లుగా జాలకు మారి, బ్రహ్మయ్యలకు పోస్టింగ్ ఇచ్చారు.

అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2025- 26కు సంబంధించి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు మంగళవారం తెలిపారు. అనాథ, పాక్షిక అనాథ, నిరుపేద, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. 2024- 25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన బాలికలు తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్, రెండు ఫొటోలతో ఈనెల 24వ తేదీ లోపు భువనగిరిలోని బాల రక్షా భవన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి సమాచారానికి 95737 27033, 97011 82198 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హనుమంతుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. తమలపాకులతో అర్చించారు. అదేవిధంగా ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి.

పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ

- ఇటీవల పోచంపల్లి చేనేత సదస్సులో మంత్రి తుమ్మల హామీ
- హ్యాండ్లూమ్ పార్కు భవనాలను సిద్ధం చేస్తున్న అధికారులు
- వచ్చే సెమిస్టర్ నాటికి ఇక్కడే తరగతుల నిర్వహణకు కసరత్తు



భూదాన్‌పోచంపల్లి: చేనేత వృత్తిలో ఆధునిక సాంకేతికతను జోడించి యువతకు శిక్షణ ఇచ్చే ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) సంస్థ త్వరలో ఇక్కత్‌వస్త్రాలకు పేరొందిన పోచంపల్లిలో ఏర్పాటు కానుంది. ఈ నెల 2న పోచంపల్లిలో నిర్వహించిన చేనేత సదస్సులో రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పోచంపల్లిలోనే ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వగా.. ఈమేరకు టెస్కో కొనుగోలు చేసిన పోచంపల్లి హ్యాండ్లూమ్‌పార్కు భవనాలను సిద్ధం చేస్తున్నారు.

హ్యాండ్లూమ్ పార్కు అనుకూలం..
పోచంపల్లి మండలంలోని కనుముకుల పరిధిలో గల హ్యాండ్లూమ్ పార్క్‌లో ఐఐహెచ్‌టీకి ఎంతో అనుకూలం. కేంద్ర ప్రభుత్వం స్కీమ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్ కింద రూ.43 కోట్ల వ్యయంతో నిర్మించిన హ్యాండ్లూమ్ పార్కును 2008లో అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటైన పార్కు పెట్టుబడి, నిర్వహణ లేక మూతపడింది. దీంతో టెస్కో మూడేళ్ల క్రితం రూ.12 కోట్లకు కొనుగోలు చేసింది. అప్పటినుంచి ఎలాంటి కార్యకలాపాలు లేక నిరుపయోగంగా మారింది. ఈనేపథ్యంలో పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆలోచన మేరకు పార్కులోని నిరుపయోగ భవనాలను రెనోవేషన్ పనులు చేస్తున్నారు. వచ్చే సెమిస్టర్ నాటికి పోచంపల్లి హ్యాండ్లూమ్‌పార్కులో తరగతులు నిర్వహించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తాత్కాలికంగా హైదరాబాద్‌లో నిర్వహణ
దేశవ్యాప్తంగా 11 ఐఐహెచ్‌టీలు ఉండగా కేంద్ర ప్రభుత్వం గతేడాది తెలంగాణకు ఐఐహెచ్‌టీ మంజూరు చేసింది. అయితే ఐఐహెచ్‌టీ పోచంపల్లిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా, 2024–25 విద్యా సంవత్సరం నుంచే ఐఐహెచ్‌టీ కోర్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో హ్యాండ్లూమ్ పార్కులో సరైన సదుపాయాలను లేనికారణంగా అధికారులు తాత్కాలికంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో తరగతులు నిర్వహిస్తున్నారు.

కోర్సులు ఇవే..
మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో భాగంగా 6 సెమిస్టర్లలో గణితం, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, ఎన్విరాన్‌మెంట్‌సైన్స్, ఐటీ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానిక్స్, టెక్స్‌టైల్ ఫైబర్స్, మ్యానుఫాక్చరింగ్ టెక్నాలజీ, హ్యాండ్లూమ్ వీవింగ్ టెక్నాలజీ ఫ్రాబ్రిక్ స్ట్రక్చరింగ్, కెమికల్ ప్రాసెసింగ్ ఆఫ్ టెక్స్‌టైల్, ఫ్రాబ్రిక్ ఎనాలిసిస్, టెక్స్‌టైల్ టెస్టింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్, జకార్డ్ వీవింగ్, కంప్యూటర్ ఎయిడ్ టెక్స్‌టైల్ డిజైనింగ్, మైనర్, మేజర్ ప్రాజెక్ట్స్, హ్యాండ్‌క్రాఫ్ట్ టెక్స్‌టైల్ అండ్ హ్యాండ్లూమ్ టూరిజం ఆఫ్ ఇండియాతో పాటు నాలుగు ఎలెక్టివ్ సబ్జెక్ట్స్ ఉంటాయి. కోర్సుల్లో చేరిన ప్రతి విద్యార్థికి నెలనెలా రాష్ట్ర ప్రభుత్వం రూ.2500లు, కేంద్ర ప్రభుత్వం రూ. 5000ల చొప్పున ఉపకార వేతనం చెల్లిస్తుంది.

చేనేత యువతకు ఉపయోగం



ఐఐహెచ్‌టీ పోచంపల్లిలో ఏర్పాటు చేయడమే సమంజసం. చదువుకున్న చేనేత యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలతో శిక్షణ ఇవ్వడం వల్ల నూతన ఆవిష్కరణలు జరుగుతాయి. తద్వారా చేనేత పరిశ్రమ సజీవంగా ఉంటుంది. ఉపాధి కూడా మెరుగవుతుంది. ఐఐహెచ్‌టీకి పోచంపల్లి అన్ని విధాలుగా అనుకూలంగా ఉంది.
– భారత లవకుమార్, పోచంపల్లి టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు

భవనాలను సిద్ధం చేస్తున్నారు



వచ్చే సెమిస్టర్ నాటికి ఆరునెలల్లో పోచంపల్లి హ్యాండ్లూమ్‌పార్కులో ఐఐహెచ్‌టీ తరగతులు ప్రారంభమవుతాయి. అందుకనుగుణంగా హ్యాండ్లూమ్ పార్కులోని భవనాలను సిద్ధం చేస్తున్నారు. 2024లో విద్యాసంవత్సరం వృథా కావొద్దని తాత్కాలికంగా హైదరాబాద్‌లో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం, అధికారులు కూడా చేనేత కళాకారులు అధికంగా ఉండే పోచంపల్లిలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.
– పద్మ, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్

ఆపరేషన్ సింధూర్‌తో సత్తాచాటిన భారత్


భువనగిరి పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, గూడూరు నారాయణరెడ్డి

- ఎంపీ ఈటల రాజేందర్

భువనగిరి: పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలను అంతమొందించేందుకు నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయంతో భారత్ సత్తా ప్రపంచ దేశాలకు తెలిసిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయం సందర్భంగా మంగళవారం భువనగిరి పట్టణంలో భారత సాయుధ దళాల గౌరవ సూచికంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసి లాల్‌చౌక్‌లో మూడు రంగుల జెండాను ఎగురవేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందన్నారు. అమెరికాలో భారత శాస్త్రవేత్తలతో పాటు వైద్య రంగంలో, మేధో శక్తి కలిగిన ఎంతో మంది ఉన్నారన్నారు. దేశంలో శాస్త్ర సాంకేతికతకు కొదవ లేదన్నారు. అంతకు ముందు పట్టణంలోని హన్మాన్‌వాడ నుంచి స్థానిక వినాయక చౌరస్తా వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, పడాల శ్రీనివాస్, దాసరి మల్లేశం, వేముల అశోక్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, యాత్ర జిల్లా కన్వీనర్ మాయ దశరథ, పట్టణ కమిటీ అధ్యక్షుడు రత్నపురం బలరాం, వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

‘టీ హబ్’లో నిలిచిన పరీక్షలు

- సాధారణ రక్త పరీక్షలకే పరిమితమైన సెంటర్
- పీహెచ్‌సీల నుంచి తగ్గిన శాంపిల్స్
- ఇబ్బందులు పడుతున్న రోగులు


భువనగిరిలోని టీహబ్

సాక్షి,యాదాద్రి : భువనగిరిలోని ‘టీ హబ్’లో ఉచితంగా చేసే బయోకెమికల్ పరీక్షలు కొన్ని రోజులుగా నిలిచిపోయాయి. పర్యవేక్షణ లేకపోవడంతో టీ హబ్‌లో పరికరాలు పనిచేయడంలేదు. కేవలం రోగులకు సీబీసీ టెస్ట్‌లను మాత్రమే చేసి పంపిస్తున్నారు. మిషన్‌లు సరిగా పనిచేయడం లేదన్న కారణంగా ప్రధానమైన టెస్ట్‌లు చేయడం లేదు. థైరాయిడ్, కిడ్నీ, లివర్ ప్రొఫైల్స్, కాల్షియం, విటమిన్ డీ-3, బీ-12 పరీక్షలు జరగడం లేదు. మిషన్ షెట్ డౌన్ కావడంతోనే పరీక్షలు చేయడం లేదని సమాచారం. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతర లేక కొందరు ప్రైవేట్‌లో రూ.వేలు చెల్లించి పరీక్షలు చేయించుకుంటున్నారు. జిల్లాలోని 21 పీహెచ్‌సీల నుంచి టీ హబ్‌కు ప్రతిరోజూ టెస్ట్‌ల కోసం రక్తనమూనాలు తెస్తారు. పరీక్షల అనంతరం ఆన్‌లైన్‌లో రోగులకు టెస్ట్ రిపోర్టులు పంపిస్తారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉండడంతో పీహెచ్‌సీల నుంచి ప్రతిరోజు తీసుకొచ్చే టెస్ట్‌ల శాంపిల్స్ కూడా తగ్గిపోయాయి. పరికరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

బయో కెమిస్ట్రీ మిషన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది
టీహబ్‌లో బయో కెమిస్ట్రీ మిషన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో బయోకెమికల్‌కు సంబంధించిన పరీక్షలు నిలిచిపోయాయి. మంగళవారం మిషన్‌కు మరమ్మతులు చేసేందుకు ఇంజనీర్లు వచ్చారు. గురువారం నుంచి యథావిధిగా పరీక్షలు జరుగుతాయి. థైరాయిడ్ పరీక్షల నిర్వహణకు సంబంధించి రీసెంట్ సప్లై లేకపోవడంతో ఆ పరీక్ష కూడా జరగలేదు. పరీక్షలన్నీ యథావిధిగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.
– వెంకటేశ్వర్లు, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

చారిత్రక ప్రదేశాలను భావితరాలకు అందించాలి


చాడ గ్రామంలో తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న చారిత్రక ప్రతినిధుల బృందం

- దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్

మోటకొండూరు: చారిత్రక ప్రదేశాలను సంరక్షించి భావితరాలకు అందించాలని దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ కేపీ రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజిస్ట్ బాబ్జీరా అన్నారు. మోటకొండూరు మండలంలోని చాడ గ్రామంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుపుతున్న చారిత్రక తవ్వకాల ప్రదేశాన్ని మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాగరాజు వారికి స్థల ప్రాధాన్యతను వివరించారు. బృందం సభ్యులు మాట్లాడుతూ.. విలువైన సంపదను సంరక్షించి భావితరాలకు అందించాలన్నారు. ప్రభుత్వం ఈ ప్రదేశాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. వారి వెంట భువనగిరి హెరిటేజ్ కమిటీ మెంబర్స్, అసిస్టెంట్ డైరెక్టర్స్ నాయక్, సాగర్ తదితరులున్నారు.

చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ హనుమంతరావు


నాగారం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంత రావు

వలిగొండ : రైతులు అధైర్యపడొద్దని, కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం వలిగొండ మండలంలోని నాగారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం, వెల్వర్తిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డితో కలిసి సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి పూర్తయ్యేవరకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రానీయొద్దన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయాధికారులు ఉన్నారు.

వరిలో సాగునీటి వినియోగాన్ని తగ్గించాలి

భూదాన్‌పోచంపల్లి: వరిలో సాగునీటి వినియోగాన్ని తగ్గించి భావితరాలకు నీటి లభ్యతను పెంచాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమోహన్, బాలచంద్ అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని దంతూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఆవరణలో రైతుముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. పంటల మార్పిడి, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుర్వి వెంకటేశ్‌గౌడ్, మండల వ్యవసాయాధికారిణి శైలజ, ఏఈఓ నరేశ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లలో బదిలీల ప్రక్రియ

- సొసైటీల సీఈఓలకు త్వరలో స్థానచలనం

నల్లగొండ టౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని 107 సహకార సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న సీఈఓల బదిలీలు చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సహకార వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు 44 జీఓను విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలకు మించి ఒకేచోట పనిచేస్తున్న సీఈఓలను బదిలీ చేసే ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. పలువురు సీఈఓలు దీర్ఘకాలికంగా సంఘాల్లో విధులు నిర్వహిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సంఘాలను ఆర్థికంగా దివాళా తీయిస్తున్నారనే అపవాదు ఉంది. ప్రస్తుత చైర్మన్ కుంభం శ్రీనివాస రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే దీర్ఘకాలికంగా సంఘాల్లో ఉద్యోగాలు చేస్తున్న సీఈఓలను బదిలీ చేయిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రాష్ట్ర సహకార వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుపై ఒత్తిడి తెచ్చి బదిలీల ప్రక్రియకు ఉత్తర్వులను జారీ చేయించారు. త్వరలో జిల్లాస్థాయి ఎన్‌పవర్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సంఘాల్లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న సీఈఓలను బదిలీ చేయనున్నారు.

పారదర్శకంగా బదిలీలు
రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 44 ప్రకారం జిల్లా ఎన్‌పవర్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో సంఘాల సీఈఓల బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తాం. సీఈఓలు దీర్ఘకాలికంగా విధులు నిర్వహిస్తుండటం వల్ల సంఘాల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. బదిలీల వల్ల సంఘాలు బలోపేతమయ్యే అవకాశం ఉంది.
– కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

పార్టీ పదవా.. కౌన్సిలర్ టికెటా?

- సందిగ్ధంలో కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నేతలు
- ఆలేరులో ఉత్కంఠగా మారిన కమిటీల ఎన్నిక

ఆలేరు: మున్సిపల్, పంచాయతీల ఎన్నికల నాటికి పార్టీని మరింత పటిష్టం చేయడంపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి సారించింది. ఆలేరు గ్రామ, మండల, బ్లాక్‌స్థాయి కమిటీల ఎన్నికను అభిప్రాయం మేరకు పోటీ లేకుండా, ఏకగ్రీవంగా ఏర్పాటు చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వెల్లడించారు. దీంతో అధికారికంగా ఎవరూ ఎమ్మెల్యే, పార్టీ పరిశీలకులకు విన్నవించకపోయినా పలువురి నేతల పేర్లు పోటీలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుండటం గమనార్హం. ఈనేపథ్యంలో ఆయా కమిటీ అధ్యక్షుల ఎన్నిక ఉత్కంఠ రేపుతోంది. కాగా.. పార్టీలో క్షేత్రస్థాయిలో వివాద రహితులై, పూర్తి సమయం కేటాయించే నాయకులు, కార్యకర్తల కోసం ఎమ్మెల్యే ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఎమ్మెల్యే వివిధ వర్గాల ద్వారా సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం.

పాత వారే కొనసాగేనా..
త్వరలో స్థానిక ఎన్నికలు రాబోతున్నాయి. ఈక్రమంలో పార్టీ పదవి కావాలంటే కౌన్సిలర్, పంచాయతీ సభ్యుడి టిక్కెట్ ఆశించొద్దు. ఈఅంశం నేతలను సందిగ్ధంలో పడేసింది. అధిష్టానం సూచనలు, మెజార్టీ శ్రేణుల అభిప్రాయం, ఎమ్మెల్యే అనుకున్న అంశాల ప్రకారం ఆశావాహుల వడపోత తరువాత సదరు నేతకు పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం ఉంటుందనే చర్చ పార్టీలో జరుగుతోంది. ఒక మండలంలో కమిటీలను మార్చితే, దాని ప్రభావం ఇతర మండలాలపై పడే ప్రమాదం ఉన్నందున, పాత కమిటీలను యథావిధిగా కొనసాగిస్తారా? లేదా కొత్త ముఖాలకు ఛాన్స్ ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఆశావాహులు ఎవరికి వారే పరోక్షంగా ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే, పరిశీలకులను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

భువనగిరి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలకు 5,568 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 3,593, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,975 మంది ఉన్నారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌తోపాటు సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. 15 మంది సీఎస్, 15 మంది డీఓలను నియమించారు. ప్రశ్నపత్రాల నిల్వ కోసం 10 స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశారు.

లక్ష్యానికి చేరువగా..


రామన్నపేటలో తూకం వేసిన ధాన్యం బస్తాలను లారీలోకి లోడు చేస్తున్న హమాలీలు

తుది దశకు ధాన్యం కొనుగోళ్లు
- రూ.615.92 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం
- చెల్లింపులు 95 శాతం పూర్తి
- పది రోజుల్లో పూర్తికానున్న ప్రక్రియ


రామన్నపేట: యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరాయి. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం మూడు లక్షల మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటి వరకు 31,510 మంది రైతులకు సంబంధించిన 2,77,717 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సివిల్ సప్లై శాఖ ద్వారా కొనుగోలు చేసింది. ఈ నెలాఖరు వరకు నూరుశాతం లక్ష్యం చేరుకోవడానికి అధికార యంత్రాంగం కృషిచేస్తోంది.

375 కేంద్రాల ద్వారా..
జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం 375 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో 124 ఐకేపీ కేంద్రాల ద్వారా 81,190 మెట్రిక్‌టన్నులు, పీఏసీఎస్‌కు చెందిన 237 కేంద్రాల ద్వారా 1,79,961 మెట్రిక్‌టన్నులు, 14 ఎఫ్‌పీఓల ద్వారా 16,565 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 106 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయి.

95 శాతం చెల్లింపులు
సివిల్ సప్లయ్ శాఖ ఇప్పటివరకు 2,77,717 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ.641.81 కోట్లు. కొనుగోలు చేసిన ధాన్యంలో 2,70,302 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేసింది. మిల్లుల్లో ధాన్యం దిగుమతి అనంతరం రైతుల వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేశారు. ఇప్పటి వరకు 2,50,736 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూ.581.70 కోట్ల విలువైన ధాన్యం వివరాలను ఎంట్రీ చేయగా రూ.544.66 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటి వరకు 95 శాతం చెల్లింపులు పూర్తయ్యాయి. ఇంకా రూ.37.04 కోట్లు చెల్లించాల్సి ఉంది.

కొనుగోలు చేసిన ధాన్యం 2,77,717 మెట్రిక్ టన్నులు
కొన్న ధాన్యం విలువ రూ. 641.81 కోట్లు
ట్యాబ్‌లో ఎంట్రీ చేసిన ధాన్యం 2,50,736 మెట్రిక్ టన్నులు
ఎంట్రీ చేసిన ధాన్యం విలువ రూ. 581 కోట్లు
రైతుల ఖాతాల్లో జమ చేసిన డబ్బులు రూ. 544 కోట్లు
చెల్లించాల్సినవి రూ. 37 కోట్లు

నాలుగు రోజుల్లో డబ్బులు జమయ్యాయి



యాసంగి సీజన్‌కు సంబంధించి పది ఎకరాల్లో వరిసాగు చేశాను. 600బస్తాల దిగుబడి వచ్చింది. 240 క్వింటాళ్ల తూకం వచ్చాయి. లారీ ఎగుమతి చేసిన తరువాత రెండు రోజుల తరువాత ట్యాబ్‌లో ఎంట్రీ చేశారు. నాలుగు రోజులకే ధాన్యం డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి.
– పోచబోయిన లింగయ్య, వెల్లంకి రైతు

రైతులకు ఇబ్బంది లేకుండా చెల్లింపులు



ధాన్యం డబ్బుల చెల్లింపు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వడం లేదు. ఇప్పటి వరకు 90శాతం మంది రైతులకు ధాన్యం డబ్బులను వారి ఖాతాల్లో జమ చేశాం. నిధుల కొరత లేదు. ప్రతిరోజూ చెల్లింపులు జరుగుతూనే ఉన్నాయి. వారం పది రోజుల్లో కొనుగోళ్లు పూర్తవుతాయి.
– హరికృష్ణ, జిల్లా మేనేజర్ జిల్లా పౌరసరఫరాల శాఖ

క్లుప్తంగా

పాముకాటుతో మహిళ మృతి

వలిగొండ : పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పురం ఆవాసం పల్లొంపు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలంలోని పహిల్వాన్ పురం ఆవాసం పల్లొంపు గ్రామానికి చెందిన మద్ది అరుణమ్మ (58) సోమవారం తన ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి 3.30 గంటల సమయంలో కుడి చేతి బొటనవేలుపై పాముకాటు వేసింది. అరుణమ్మ వెంటనే పక్కింటి వారికి, కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు ఆమెను భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అరుణమ్మ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ పేర్కొన్నారు.

గల్లంతైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

పెద్దఅడిశర్లపల్లి : ప్రమాదవశాత్తు ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో పడి గల్లంతైన వృద్ధురాలి మృతదేహం మంగళవారం లభ్యమైంది. వివరాలు.. గుడిపల్లి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఓర్సు వెంకటమ్మ(60) సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని వడ్డరిగూడెంలో తన కూతురు వద్దకు వెళ్లి అక్కంపల్లి రిజర్వాయర్ కట్టపై నుంచి వస్తోంది. ఈ క్రమంలో నీటిని తాగేందుకు ఏకేబీఆర్ హెడ్ రెగ్యూలేటర్ వద్ద గల ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ వద్ద ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయింది. గమనించిన స్థానికులు గుడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకుని నీటి విడుదల నిలిపివేసి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ మెయిన్ గేట్ వద్ద వెంకటమ్మ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై కేసు

వలిగొండ : అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. వలిగొండ మండలంలోని వేములకొండకు చెందిన రైతు వ్యవసాయ భూమిలో బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈమేరకు బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. జిలెటిన్ స్టిక్స్ 23, డిటోనేటర్స్ 15, మెగ్గర్ బాక్స్, 3 బైండింగ్ వైర్ బిండల్, పది మీటర్ల వైరును స్వాధీనం చేసుకున్నారు. అతడితోపాటు, భూ యజమానిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

భూ వివాదం కేసులో నెలరోజుల జైలు శిక్ష

నిడమనూరు : భూ వివాదంలో ఘర్షణ పడిన కేసులో ఇద్దరికి నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి నెలరోజుల జైలు శిక్ష విధించారు. అనుముల మండలం, అనుముల గ్రామానికి చెందిన చందా శ్రీనివాస్‌రెడ్డిపై భూ వివాదం, బాట పంచాయతీని మనస్సులో ఉంచుకొని గాయపరిచారు. జూలై5, 2016న సాయంత్రం గ్రామ సమీపంలోని ఈశ్వర్‌నగర గ్రామానికి చెందిన కుస్ రెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి లు భూమి రహదారి విషయంలో చందా శ్రీనివాస్‌రెడ్డిపై కర్రలతో దాడి చేసి, గాయపరిచారు. పోలీసులకు బాధితుడు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదుతో అప్పటి ఎస్‌ఐ ఏ వెంకటయ్య కేసు నమోదు చేశారు. కేసులో సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి స్వప్న నిందితులకు ఒక నెల జైలు శిక్ష, లేకపోతే రూ.1000ల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ సాధన వాదనలు వినిపించారు.

సౌరశక్తి వినియోగంతో ఆర్థికాభివృద్ధి

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీఈఓ సుధాకర్

కట్టంగూర్ : సౌరశక్తి వినియోగంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆర్థికసాయంతో స్వబాగ్ ల్యాబ్స్ ద్వారా ఏర్పాటు చేసిన స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ కోఆపరేటివ్ సోలార్ బ్యాటరీ యూనిట్లను మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోలార్ ప్యానల్‌తో విద్యుత్‌ను స్టోరేజీ చేసి ఆదాయం సంపాదించేందుకు దేశంలోనే మొదటిసారిగా అయిటిపాములలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వశక్తితో మహిళలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా 50 మంది స్వయం సహాయక మహిళలకు రూ.50 లక్షలు ఇచ్చామని తెలిపారు. త్వరలో ఈ 50 మంది మహిళలకు బ్యాంకు ద్వారా మూడు లక్షల రూపాయల చొప్పున బ్యాంకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఒప్పంద పత్రాలు అందజేత

రాజీవ్ యువ వికాసం కింద నిరుద్యోగ యువతకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున జూన్ 2న అందించనున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో అయిటిపాముల మాదిరిగానే నల్లగొండ మండలం చర్లపల్లి గ్రామంలో సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసి గ్రామాన్ని దత్తత తీసుకుంటామన్నారు. అయిటిపాములలో 100 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఒక్కొక్కరికి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం మహిళలకు రూ.10 లక్షల చెక్కు, స్వచ్ఛ శక్తి కేంద్రం, మహిళా సంఘాల మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ మహిళలు సోలార్ ప్యానెల్‌ను సద్వినియోగం చేసుకుని ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ యూనిట్ల ద్వారా



మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మహిళలకు నెలకు రూ.2 వేలు ఆదాయం లభిస్తుందని తెలిపారు. మంత్రి చొరవతో రూ.100 కోట్లతో అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయించామని, పైపులైను పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. విద్యుత్ యూనిట్లకు కోతుల బెడద లేకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్వబాగ్ ల్యాబ్స్ యజమాన్యాన్ని కోరారు.

మహిళలు ఇంటి నుంచే ఆదాయం పొందేలా

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మహిళలు ఇంటి నుంచే ఆదాయం పొందేలా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేశామన్నారు. సోలార్ విద్యుత్ బ్యాటరీ జీవిత కాలం 10 సంవత్సరాలు పనిచేస్తుందన్నారు. 50 మందితోపాటు గ్రామంలోని మిగతా మహిళలను బ్యాటరీ ఏర్పాటులో భాగస్వాములను చేస్తామన్నారు. స్వలాబ్ ల్యాబ్స్ సీఈఓ సుధాకర్ మాట్లాడుతూ ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 50 మంది మహిళలకు రూ.50 లక్షలు అందించి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ బ్యాటరీ దేశంలోనే మొదటిదని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలు, విద్యుత్‌కు బదులుగా ఈ బ్యాటరీలను ఉపయోగించుకోవచ్చన్నారు. తామే బ్యాటరీలను కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ మాట్లాడుతూ సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌కు ప్రభుత్వం యూనిట్‌కు రూ.3 నుంచి 3.50 రూపాయలు ఇస్తుండగా, స్వబాగ్ ల్యాబ్స్ వారు యూనిట్‌కు రూ.16.50 చెల్లిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, మండల ప్రత్యేక అధికారి కోటేశ్వర్‌రావు, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీలు సుంకర బోయిన నర్సింహ, మాద యాదగిరి, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, ఏపీఓ రాంమోహన్ ఉన్నారు.

నెలకు రూ.2వేల ఆదాయం వస్తోంది



ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో మా ఇంట్లో ఏర్పాటు చేసిన సోలార్ ఆఫ్ గ్రిడ్ కోఆపరేటివ్‌తో నెలకు రూ.2 వేల ఆదాయం వస్తోంది. ఇప్పటికే రెండు నెలల డబ్బులు నా ఖాతాతో జమ అయ్యాయి. సోలార్ ప్లేట్‌ల క్లీనింగ్ తప్ప ఎలాంటి రిస్క్ లేదు. ప్రతి నెల రూ.2 రావడంతో ఇంట్లో చిల్లర ఖర్చులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– పసునూరి విజయలక్ష్మి, అయిటిపాముల

కాంగ్రెస్ పాలనలో అధికారులకు రక్షణ కరువు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట : కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ అధికారులకు రక్షణ కరువైందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్యాల మండలం నేరడ గ్రామంలో ఇరిగేషన్ అధికారులపై దాడి జరిగితే బాధ్యత గల అధికార పార్టీ నాయకులే కేసు లేకుండా చేశారని ఆరోపించారు. గవర్నర్ అధికార నివాసంలో చోరీ జరగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ధాన్యం కొనుగోళ్లు, ఎగుమతులు, గన్నీ బ్యాగుల సరఫరాలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన పేరుతో హడావిడి చేసి పేదల ఇళ్లను కూల్చారని, ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి వేధించడం మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. పార్టీలకు


మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య, నాయకులు

అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు బద్దుల ఉమారమేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్‌గౌడ్, సాల్వేరు అశోక్, అంతటి రమేష్, ఎస్‌కే చాంద్, బత్తుల వెంకటేశం, గర్దాసు విక్రం, మిర్యాల మల్లేశం, జాడ సంతోష్, ఆమేర్, బొడ్డు అల్లయ్య, కూనూరు శ్రీనివాస్, బాలగోని శివ, జాల అమరేందర్‌రెడ్డి ఉన్నారు.

నృసింహుడి సేవలో హిమాన్ష్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు, మాజీ మంత్రి కేటీఆర్ తనయుడు కల్వకుంట్ల హిమాన్షు తన స్నేహితులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హిమాన్షుకు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి ప్రసాదాన్ని అందించారు. కాగా హిమాన్షుకు ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య స్వాగతం పలికారు.


కల్వకుంట్ల హిమాన్షు, స్నేహితులకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు, చిత్రంలో గొంగిడి సునీత

భార్య మృతికి కారణమైన భర్తకు యావజ్జీవ శిక్ష

చివ్వెంల(సూర్యాపేట) : భార్య మృతికి కారణమైన భర్తకు జీవితఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీ శారద మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెం గ్రామానికి కుకుంట్ల కిరణ్ సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి యాదాద్రి భవనగరి జిల్లా కేంద్రంలోని సంజీవ్ నగర్‌కు చెందిన భవానితో 2017 సంవత్సరంలో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.7 లక్షల కట్నంతో పాటు, సుమారు 45 తులాల బంగారం, ఇంటి సామాన్లు మొత్తం రూ.25 లక్షలు ఇచ్చారు. వివాహ అనంతరం సూర్యాపేటలోని ఏరియా హాస్పిటల్ వద్ద ఇల్లు అద్దెకు తీసుకుని జీవనం చేస్తున్నారు. వీరితోపాటు కిరణ్ తల్లి సాలమ్మ వారి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో భవాని నాలుగు నెలల గర్భవతిగా ఉండగా, భర్త కిరణ్ అదనపు కట్నం రూ.5 లక్షలు తీసుకు రావాలని ఒత్తిడి చేయసాగాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో దీపావళికి ఇస్తామని సర్దిచెప్పారు. అయినా కిరణ్‌లో మార్పు రాకపోగా ఇబ్బందులు పెడుతుండడంతో 2017 అక్టోబర్ 15న భవాని అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. విషయాన్ని కిరణ్ తన అత్తమామలకు ఫోన్ చేసి చెప్పడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని చూసేసరికి భవాని చనిపోయి ఉంది. దీంతో తన కూతురును అల్లుడు కిరణ్, అత్త సాలమ్మ, కిరణ్ అన్న క్రాంతి కలిసి హత్య చేశారని, మృతురాలి తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి డీఎస్పీ, ప్రస్తుతం ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. పీపీ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవించి నిందితుడు కిరణ్‌కు సెక్షన్-302 ప్రకారం జీవితఖైదు రూ.20 వేల జరిమానా, సెక్షన్ 498-ఎ ప్రకారం 3 సంవత్సరాల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధించారు. జరిమాన కట్టకుంటే రెండు కేసుల్లో మరో సంవత్సరం జైలు శిక్ష ఉండేలా తీర్పు వెల్లడించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ లెనిన్ సహకరించారు.

తల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): కన్న తల్లిని హత్య చేసిన కసాయి కొడుకుకి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పీఏపల్లి మండలం బాలాజీనగర్ తండాకు చెందిన మెగావత్ మున్నా కూలి పనులు చేస్తూ తల్లి మెగావత్ బుజ్జితో కలిసి నివాసం ఉంటున్నాడు. సోదరి వివాహం జరగడంతో కల్యాణ లక్ష్మి డబ్బులు వచ్చాయి. ఈ క్రమంలో జూలై 6వ తేదీ 2020 రాత్రి డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవ పడ్డాడు. డబ్బులు ఇవ్వనని తల్లి చెప్పడంతో రోకలి బండతో ఆమె తలపై బలంగా మోదడంతో కేకలు వేసింది. గమనించిన స్థానికులు ఇంట్లోకి రావడంతో మున్నా అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో చుట్టుపక్కలవారు స్థానికంగా ఉంటున్న మరో కుమారుడు మెగావత్ పాండుకు సమాచారం ఇచ్చారు. పాండు ఇంటికి వచ్చి చూసేసరికి తల్లి మెగావత్ బుజ్జి రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉంది. ఈ మేరకు మెగావత్ పాండు గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన అప్పటి సీఐ పి.పరుషరాములు, ఎస్‌ఐ జె.గోపాల్‌రావు.. నిందితుడు మున్నాను అరెస్టు చేశారు. విచారణ జరిపిన అనంతరం పోలీసులు చార్జీషీటు నమోదు చేసి మున్నాను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.శ్రీవాణి వాదనలతో ఏకీభవించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు సెక్షన్ 302 ప్రకారం మెగావత్ మున్నాకు యావజ్జీవ కారాగార శిక్ష రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రస్తుత సీఐ డి.రాజు, ఎస్‌ఐ ఎం.నరిసింహులు, కోర్టు కానిస్టేబుల్ జె.నగేష్, లైజన్ అధికారులు పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్ విచారణకు సహకరించారు.

గోవులను తరలిస్తున్న వాహనాలు పట్టివేత

చింతపల్లి: కొండమల్లేపల్లి వైపు నుంచి హైదరాబాద్‌కు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 9 ఆవు దూడలను పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం చింతపల్లి మండల పరిధిలోని మాల్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాల్లో 9 ఆవు దూడలను కబేళాలకు తరలిస్తుండగా వాటికి ఎలాంటి అనుమతి లేదని గుర్తించి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులైన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు చెందిన నోముల భాగ్యయ్య గౌడ్ ఎండీ.సాజిద్‌పాషాను పట్టుకున్నారు. ఆవు దూడలకు వెటర్నరీ డాక్టర్ వద్ద పరీక్షలు నిర్వహించి, గురునానక్ గోశాల వెల్దండకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

భార్యను చంపిన కేసులో నిందితుడికి పదేళ్లు..

సంస్థాన్ నారాయణపురం: కట్టుకున్న భార్యను చంపిన కేసులో నిందితుడు పెట్టుగళ్ల ఈశ్వర్‌కు భువనగిరి జిల్లా కోర్టు జడ్జి జయరాజ్ 304 సెక్షన్ కింద 10 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.37 వేల జరిమానా విధించారు. వివరాలు.. డిసెంబర్ 2020లో సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామంలో ఈ సంఘటన జరగగా.. పలుమార్లు వాదనలు విని, సాక్షులను విచారించిన అనంతరం జడ్జి తీర్పు వెలువరించారు. చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామ పరిధిలోని అరిసేనిగూడెంకు చెందిన సంతోషకు సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామానికి చెందిన పెట్టుగళ్ల ఈశ్వర్‌తో 2009లో వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు చందు, సాకేత్ ఉన్నారు. వీరు సంస్థాన్ నారాయణపురంలో ఫాస్ట్‌పుడ్ సెంటర్ నిర్వహించారు. కరోనా కారణంగా లాక్‌డౌన్ విధించడంతో ఫాస్ట్‌పుడ్ సెంటర్ మూతపడింది. దీంతో ఆ కుటుంబం చిల్లాపురంకు చేరుకుంది. ఈ క్రమంలో 19 డిసెంబర్ 2020న రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఈశ్వర్ తన భార్యను సైకిల్ గాలి పంపుతో కొట్టడంతో మృతి చెందింది. తర్వాత రోజు సంతోష ఇంట్లో నుంచి బయటకు రాకపోవడం, పిల్ల లు తల్లి మృతదేహం వద్ద ఏడుస్తుండడంతో, చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ వెంకటయ్య కేసు దర్యాప్తు చేసి, సరైన సాక్ష్యలతో నివేదికను కోర్టులో సమర్పించారు. దీంతో నిందితుడికి జడ్జి శిక్ష విధించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


పరమేశ్ (ఫైల్)

శాలిగౌరారం: ఇంటివద్ద ఏం పని చేయడం లేదని తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. హైదరాబాద్ ఉస్మానియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ సంఘటన శాలిగౌరారం మండలంలోని ఆకారం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారం గ్రామానికి చెందిన క్లొం పరమేశ్(25) ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేసేవాడు. పనిమానేసిన పరమేశ్ కొంత కాలంగా ఇంటివద్దనే ఉంటున్నాడు. ఇంటివద్ద ఖాళీగా ఉంటున్న పరమేశ్‌ను ఈ నెల 15న తల్లి ఏం పనిచేయడం లేదంటూ మందలించింది. అనంతరం పరమేశ్ తల్లిదండ్రులు మనుమరాలు వివాహ నిశ్చితార్థం కోసం కట్టంగూరు మండలం ఈదులూరు గ్రామంలోని తమ పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంటివద్ద ఒంటరిగా ఉన్న పరమేశ్ శాలిగౌరారంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న స్నేహితుడి పుట్టినరోజు కార్యక్రమానికి హాజరై వచ్చాడు. అనంతరం సాయంత్రం ఇంట్లో గడ్డిమందు తాగిన ఆ విషయాన్ని తన చిన్న అక్క కుమారుడికి ఫోన్‌చేసి చెప్పాడు. ఆ సమయంలో మనుమరాలి నిశ్చితార్థం కార్యక్రమంలో ఉన్న పరమేశ్ తల్లిదండ్రులు వెంటనే ఆకారం చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న పరమేశ్‌ను నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి హైదరాబాద్ లోని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. పరమేశ్ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి సోదరుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాత నేరస్తుడు బాబా అరెస్ట్

భువనగిరిటౌన్ : మారణాయుధాలతో సంచరిస్తున్న కరుడుగట్టిన పాత నేరస్తుడు ఎండీ బాబాను భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. బుధవారం భువనగిరి పెద్ద చెరువు కట్ట వద్ద భువనగిరి పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో అనుమానాస్పద స్థితిలో ప్రయాణిస్తున్న బాబాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అతడి వద్ద డమ్మీ పిస్తోల్, ఒక గొడ్డలి, ఒక కత్తి లభించింది. దీంతో అతడిని పోలీస్ స్టేషన్‌ను తరలించి విచారించగా.. ఆత్మ రక్షణ, సొంత అవసరాలు, అక్రమ వసూళ్లు చేసేందుకు ఆయుధాలను వెంట ఉంచుకున్నట్లు చెప్పాడని తెలిసింది. గ్యాంగ్‌స్టర్ నయీం ముఠాలో బాబా కీలకంగా ఉంటూ పలు హత్యా, హత్యాయత్నాలు, కిడ్నాపులు. బెదిరింపులు, అక్రమ వసూళ్ల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పీడీ యాక్టులో జైలులో కూడా ఉన్నాడు. పలు కేసులు, కోర్టుల్లో విచారణ దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాబా మారణాయుధాలతో సంచరిస్తూ పోలీసులకు పట్టుబడడం స్థానికంగా సంచలనం సృష్టించింది. తాజాగా మరెవరిపైన అయినా దాడికి కుట్ర పన్నాడో తెలియాల్సి ఉంది. బాబా పట్టుబడింది వాస్తవమేనని, ఈ మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మాతృదేవోభవ.. పితృదేవోభవ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నవీన్


పేదలకు సన్న బియ్యం అందజేస్తున్న నవీన్

- వృద్ధులు, నిరుపేదలు, అనాథలను ఆదుకుంటున్న స్వచ్ఛంద సంస్థ
- నేడు పాటిమట్లలో 6వ వార్షికోత్సవం

మోత్కూరు : మాతృదేవోభవ-పితృదేవోభవ అనే స్వచ్ఛంద సంస్థ విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతోంది. మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన కురుమేటి నవీన్ ఏర్పాటు చేసిన మాతృదేవోభవ-పితృదేవోభవ సంస్థ ద్వారా గ్రామీణ నిరుపేద, వృద్ధులు, అనాథలు, విద్యార్థులకు ఐదు సంవత్సరాలకు పైగా వివిధ రకాల సేవలను అందిస్తోంది. నవీన్‌కు 6 సంవత్సరాల వయస్సులోనే తండ్రి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తల్లి నర్సమ్మ కూలి పనులు చేస్తూ కుటుంబ బాధ్యతలు మోస్తూ ఇద్దరు కుమారులు, నవీన్, నరేందర్‌ను చదివించింది. నవీన్ 8వ తరగతి చదువుతుండగానే తల్లి నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అమ్మమ్మ, నానమ్మ, బాబాయి గోవర్ధన్‌ల పర్యవేక్షణలో పెరుగుతూ నవీన్ 10వ తరగతి పూర్తి చేశాడు. మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఉన్నత చదువులు చదవలేక జనరల్ నర్సింగ్ మెడిసిన్ (జీఎన్‌ఎం) కోర్సు పూర్తి చేశాడు. ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ మరోవైపు సామాజిక సేవ చేస్తున్నాడు. మే 2019లో మాతృదేవోభవ-పితృదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థను నవీన్ ఏర్పాటు చేశాడు. నవీన్ అధ్యక్షుడిగా, తమ్ముడు నరేందర్ ఉపాధ్యక్షుడిగా, బాబాయి కురుమేటి గోవర్ధన్ సహకారంతో సేవలు అందిస్తున్నాడు. గ్రామంలోని పెద్ద మనుషులు, దాతలు, విద్యావంతులు సూరారం యాదయ్య, చిరుమర్తి యాదయ్య, కురుమేటి యాదయ్యల సహకారంతో పేదలకు సేవ చేస్తున్నాడు.


రక్తదానం చేస్తున్న నవీన్

వృద్ధులకు కంటి వైద్య శిబిరాలు..

మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు మండలాల్లోని అనేక గ్రామాల్లో ఆదరణకు నోచుకోని వృద్ధులు, వితంతువులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. కరోనా, లాక్ డౌన్ సమయంలో బియ్యం, నిత్యవసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేశారు. మోత్కూరు, గుండాల మండల కేంద్రాల్లో హైదరాబాద్‌కు చెందిన మ్యాక్స్ క్యూర్ ఆస్పత్రి సహకారంతో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందజేశారు. కరోనా సమయంలో పాటిమట్ల గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించి దాతల ద్వారా రక్తాన్ని సేకరించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, దుస్తులు పంపిణీ చేశారు. రామన్నపేట మండలం కక్కిరేణిగూడెంలో హైదరాబాద్ బీఎస్.రెడ్డి నగర్‌కు చెందిన సుశీల 'కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి 30 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. స్వగ్రామం పాటిమట్లలో తన ఇంటినే గ్రంథాలయంగా ఏర్పాటు చేసి 30 మంది పిల్లలకు చదువు చెబుతున్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అంబులెన్సు సర్వీస్ ఏర్పాటు చేసి సుమారు 100 మందికి పైగా సహాయం చేశారు. 2024లో విజయవాడలో వచ్చిన అకాల వర్షాలు, వరద బాధితులకు తన స్నేహితులతో కలిసి 500 మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఖమ్మంలో అకాల వర్షాలకు నివాసాన్ని కోల్పోయిన సుమారు 500 మంది బాధితులకు భోజన ప్యాకెట్లను అందజేశారు.

నేడు రక్తదానంపై అవగాహన

పాటిమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృదేవోభవ – పితృదేవోభవ 6వ వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ హాజరవుతున్నట్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నవీన్ తెలిపారు.

39మార్లు రక్తదానం చేశాను

నిరుపేద ప్రజలకు సేవ చేయడంతోపాటు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తున్నా. ఇప్పటివరకు 39 మార్లు రక్తదానం చేశా. నా తమ్ముడు నరేందర్ 15మార్లు రక్తదానం చేశాడు. అనాథలు, వృద్ధులు, వితంతువులకు సేవలు అందిస్తూ వారిలో మా అమ్మ, నాన్నలను చూసుకుంటున్నా. నా సేవలకు గుర్తింపుగా చెన్నైలో ప్రముఖ సంస్థ వారు డాక్టరేట్ అందజేశారు. మిర్యాలగూడకు చెందిన జనయిత్రి ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా సేవా రత్న పురస్కారం, ప్రశంసా పత్రం ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్.పి. పట్నాయక్ చేతుల మీదుగా అందుకున్నా.

– కురుమేటి నవీన్, అధ్యక్షుడు

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తులు మృతి

భువనగిరి: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీ రాత్రి భువనగిరి-వంగపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ లైన్‌లో హెడప్సర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు భావిస్తున్నామని స్థానిక రైతులు తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, చాతి కింద పుట్టు మచ్చ, మెరూన్ కలర్ పాయింట్ వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్ 9848222169, 8712568454ను సంప్రదించాలని భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ జీ.కృష్ణారావు తెలిపారు.

భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో..

ఈ నెల 19వ తేదీన అర్ధరాత్రి తర్వాత భువనగిరి రైల్వే స్టేషన్‌లోని యార్డు ప్లాట్ ఫాం నంబర్ 2 సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైలులో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎడమ వైపు చాతిపై అమ్మ లక్ష్మీ టాటూ, నీలం కలర్ జీన్స్ పాయింట్ వేసుకుని ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 9848222169, 8712568454ను సంప్రదించాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


పి.జ్యోతి

మోత్కూరు: మోత్కూరు తహసీల్దార్‌గా పి.జ్యోతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.ఉపేందర్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలేరు తహసీల్దార్‌గా ఆంజనేయులు


వి.ఆంజనేయులు

ఆలేరురూరల్ : ఆలేరు తహసీల్దార్‌గా వి.ఆంజనేయులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన అంజిరెడ్డి భువనగిరి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో విధులు నిర్వహిస్తున్న వి.ఆంజనేయులు బదిలీపై ఆలేరుకు వచ్చారు.

బీబీనగర్ తహసీల్దార్‌గా శ్యామ్‌సుందర్ రెడ్డి


శ్యామ్‌సుందర్‌రెడ్డి

బీబీనగర్: బీబీనగర్ తహసీల్దార్‌గా శ్యామ్‌సుందర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గత కొద్దికాలంగా డిప్యూటీ తహసీల్దార్ భగత్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.

వలిగొండ తహసీల్దార్‌గా దశరథ నాయక్


దశరథ నాయక్

వలిగొండ : వలిగొండ తహసీల్దార్‌గా దశరథ నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చండూర్ మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పోచంపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస్ రెడ్డి


శ్రీనివాస్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వలిగొండ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. డీటీ నాగేశ్వర్ రావు, ఆర్‌ఐలు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చౌటుప్పల్ తహసీల్దార్‌గా వీరాబాయి


వీరాబాయి

చౌటుప్పల్ : చౌటుప్పల్ తహసీల్దార్‌గా బి.వీరాబాయి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన హరికృష్ణ గుండాల మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్ వీరాబాయికి డిప్యూటీ తహసీల్దార్ పజ్జూరు సిద్దార్థకుమార్, ఆర్‌ఐ బాణాల రాంరెడ్డి, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యాదగిరిగుట్ట తహసీల్దార్‌గా గణేష్ నాయక్


గణేష్‌నాయక్

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట తహసీల్దార్‌గా ధనావత్ గణేష్ నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఉద్యోగులు స్వాగతం పలికారు.

గుండాల తహసీల్దార్‌గా హరికృష్ణ

గుండాల : గుండాల తహసీల్దార్‌గా ఎస్.హరికృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ జలకుమారి కలెక్టరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఇప్పటివరకు చౌటుప్పల్‌లో విధులు నిర్వహించిన తహసీల్దార్ హరికృష్ణ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

‘అభివృద్ధిపై అధికార పార్టీవి అవాస్తవాలు’

ఆలేరు : నియోజకవర్గ అభివృద్ధిపై అధికార పార్టీ అవాస్తవాలు చెబుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు విమర్శించారు. మంగళవారం ఆలేరు పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శిగా చౌడబోయిన కనకయ్య, సహాయ కార్యదర్శులుగా తెడ్డు ఆంజనేయులు, పొన్నబోయిన రవిని, మండల సీపీఐ కౌన్సిల్ సభ్యులుగా 17మందిని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు పరశురాములు, వెంకటేశం, జానమ్మ, ఉదయగిరి, స్వామి, ప్రవీణ్, రాజు, మధు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకధికారి జయశ్రీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేం ద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్‌ఐ జూబేరిద్దిన్, ఏఆర్‌ఐ కట్ట పాండు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం డీపీఓ ఆర్. సునంద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం రాఘవాపురం గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ జె. రాములు నాయక్, ఎంపీఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- నిలిచిన వంగపల్లి చెరువులోకి వెళ్లే కాలువ పనులు
- కాలువలో వర్షపు నీరు నిలిచి కుంగిన సీసీరోడ్డు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి ఎస్సీ కాలనీలో చేపట్టిన కాల్వ పనులు పూర్తికాకపోవడంతో ఆ కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పట్టణంలోని గండి చెరువు నిండి అలుగు పోస్తే యాదగిరిపల్లి ఎస్సీ కాలనీ పక్కన ఉన్న కాల్వ నుంచి వంగపల్లి చెరువులోకి నీరు వెళ్లేందుకు వీలుండేంది. అయితే ఆ కాల్వ పూర్తిగా పూడుకుపోయింది. దీంతో వర్షం నీరంతా పంట పొలాల్లోకి వెళ్లి నష్టం జరుగుతుంది. కాలనీ వాసుల విన్నపం మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు గతేడాది యాదగిరిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే దారి పక్కన ఉన్న కాలువకు పూడిక తీసి సిమెంట్, కాంక్రీట్‌తో నిర్మాణ పనులు చేపట్టారు. అయితే కాల్వ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనుల్లో భాగంగా పెద్ద కందకం తీసి వదిలేశారు. దీంతో అంగడీబజార్, బీసీ కాలనీ నుంచి యాదగిరిపల్లికి దగ్గరగా ఉండే దారితో పాటు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోయింది. దీంతో మసీదు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు నుంచి తిరిగి యాదగిరిపల్లికి వెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.


కుంగిన ఎస్సీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డు


సీసీరోడ్డు వెంట నిలిచిన కాలువ పనులు

కుంగిన సీసీరోడ్డు..

యాదగిరిపల్లి ఎస్సీ కాలనీ పక్కన నుంచి వంగపల్లి చెరువులోకి నీరు వెళ్లేందుకు చేపట్టిన కాల్వ పనులు జరుగుతున్న సమయంలోనే వర్షం కురిసి ఆ నీరంతా కాలనీకి వెళ్లే సీసీరోడ్డు కిందకు చేరి మట్టి కొట్టుకుపోయింది. దీంతో సీసీరోడ్డు కుంగిపోయి ఓ వైపుకు ఒరిగింది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ఈ రోడ్డులో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడ రోడ్డు కుంగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేసి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని.. వర్షం నీరు వెళ్లేందుకు చేపట్టిన సిమెంట్, కాంక్రీట్ కాల్వ పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి



యాదగిరిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే సీసీరోడ్డు ఓ వైపుకు కుంగింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల కాలంలో రోడ్డు కుంగిపోయిన ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

– బుగ్గ శ్రీకాంత్,
యాదగిరిపల్లి ఎస్సీ కాలనీ

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వలిగొండ : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని ఏపీఓ కార్యాలయం ఎదుట ఉపాధిహామీ కూలీలతో కలిసి నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ కూలీలకు కనీస సౌకర్యాలు అందడం లేదన్నారు. కూలీలకు పని ప్రదేశంలో మంచినీరు టెంటు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన కూలీలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతరం ఏపీఓ పరుశురాములకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించేశారు. కార్యక్రమంలో సిర్పంగి స్వామి, ఈర్లపల్లి ముత్యాలు, వేముల లక్ష్మయ్య, మీసాల పోశయ్య, కిన్నెర యాదయ్య, బూడిద మనమ్మ, వేముల నాగరాజు, షేక్ కరీం, బంగారు బుచ్చయ్య, వీసం అంజయ్య, కందుకూరి బుచ్చయ్య,మీసాల ఎట్టమ్మ, ఐతరాజు బుచ్చయ్య, లోతుమల్ల వనజ,సిర్పంగి సత్తమ్మ, మీసాల జ్యోతి, మాడుగుల లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఏపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మోత్కూరు : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మంగళవారం మోత్కూరు మండలం పొడిచేడును చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మతో కలిసి ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ రెహమాన్‌అలీ, కొత్తగట్టు యాకయ్య, రాములు నాయక్, చాంద్‌పాషా, గూడ సాయి గౌడ్, పాక సోమయ్య, వేల్పుల రాములు, రామకృష్ణ, శ్రీనివాస్, భూపతి కొమురయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, చెన్నబోయిన శివ, రమణ, ఢిల్లీ వెంకన్న, తోట ఉపేందర్, నరేష్ పాల్గొన్నారు.


శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బోధన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

బీబీనగర్: ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడానికి ఏర్పాటు చేసిన శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ ఉషారాణి అన్నారు. మండలంలోని జమీలాపేట గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్‌రెడ్డి, జానీ అఫ్జన్, కోర్సు ఇంచార్జులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

గుండాల : ఉపాధ్యాయులు తమ బోధనా విధానాన్ని మెరుగుపర్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి ఎంఈఓ మన్నె అగ్గిరాములు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న లక్ష్యాలకు అనుగుణంగా బోధన సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్‌పీలు జంపాల రాజు, దార శ్రీనివాస్, సి.హెచ్.యాదగిరి, నరేష్‌కుమార్, శ్రీనివాస్, శ్రీధర్, సావిత్రి, మత్స్యగిరి, దేవనబోయిన లింగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి

తుర్కపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ మాలతి అన్నారు. మండలంలోని ముల్కలపల్లి జెడ్పీ హైస్కూల్ లో ఎస్‌జీటీలు, ఎల్ఎఫ్ఎలకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం. అశోక్, శ్రీశైలం, సైదులు, శ్రీధర్, ఎన్. భాస్కర్‌రెడ్డి, సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణ శిబిరం ప్రారంభం

ఆలేరు : ఆలేరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈఓ ఎర్ర లక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, చిట్టిబాబు, దశమంతరెడ్డి, సురేష్, సతీష్, నరేష్‌లు, ఎంఐఎస్,ఎల్‌డిఏ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


బీబీనగర్: శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఉషారాణి

ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం ప్రారంభం

బీబీనగర్: మండలంలోని జమీలాపేట గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని మంగళవారం వయోజన విద్యా డైరెక్టర్ ఉషారాణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ సీహెచ్ చిత్తరంజన్, జి. శ్రీను, ఎల్లయ్య, రామకృష్ణ, డి. సంతోష, రవీందర్ రెడ్డి, స్వామి, వేణు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: బోధన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఎంఈఓ గోలి శ్రీనివాస్‌లు అన్నారు. మండల కేంద్రంలో ప్రైమరీ లెవల్ ప్రభుత్వ ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి విగ్రహాల ఆవిష్కరణ

ఆలేరురూరల్ : పట్టణంలోని విద్యుత్ సబ్ డివిజన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి విగ్రహాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమారస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బ్రహ్మాండర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న , యాదగిరి, సిఎచ్,చంద్రడు. మురళి, నరేష్, ఏ,ఈ వెంకటేష్, బాలచారి, భాస్కర్, శ్రీకాంత్, ఉపేందర్, బాలకృష్ణ, మహేందర్, విగ్రహదాత గంగరాజు చంద్రయ్య, లక్ష్మీనర్సమ్మ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

పంటల మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చు


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఇందుధర్ రెడ్డి

తుర్కపల్లి : పంట మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఇందుధర్ రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు యూరియా వినియోగం, రసాయన ఎరువుల నియంత్రణ, పొదుపుగా నీటి వాడకం, పంటలమార్పిడి, పర్యావరణ పరిరక్షణ, భూసారం మెరుగుదల అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పుసూన్, ఎంఏఈ ఉమాశ్రీ, ఏఈలు పృథ్వీరాజ్, రాకేష్, ప్రభాకర్‌రెడ్డి, వాసురెడ్డి, లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు


శుభ్రం చేసిన కళాశాల మైదానం

సాక్షి ఎఫెక్ట్..

భువనగిరిటౌన్ : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరుకుపోయిన చెత్తాచెదారంపై మంగళవారం సాక్షి దిన పత్రికలో ‘అపరిశుభ్రంగా కళాశాల మైదానం’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కళాశాలలో పేరుకుపోయిన చెత్తా చెదా రాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఇక్కడ చెత్త వేయొద్దని బోర్డును ఏర్పాటు చేశారు.

ఆర్థికసాయం అందజేత

రాజాపేట : మండలంలోని జాల గ్రామానికి చెందిన ఠాకూర్ గణేష్ సింగ్ కుమార్తె సన ఇటీవల మృతి చెందింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2000- 2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం గణేశ్‌సింగ్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 55వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సందిల భాస్కర్‌గౌడ్, మనోజ్ సింగ్, సోమసాని వెంకటేశ్, ఠాకూర్ సబితరాణి, ప్రేమలత, నాగరాణి, భాగ్యలక్ష్మి, భానుమతి, అంకతి శ్రీకాంత్, నంగునూరి రాజేశ్వర్, నరేష్, సాగర్, మంచాల నీల్‌రాజ, ప్రేమలత పాల్గొన్నారు.

ఆలేరు : మున్సిపాలిటీ పరిధిలోని బహుపేటకు చెందిన భూషి ఉషస్‌కుమార్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. శ్రీరామ ఆటో యూనియన్ అధ్యక్షుడు గడ్డమీది వెంకటేష్‌గౌడ్ మృతుడి భార్య కవితకు రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. యూనియన్ సభ్యులు మోటే వెంకటేష్, పంజాల మహేందర్, కోనపురం నాగరాజు, సాగర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని నిరసనలు

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధా కార్యదర్శి కొండ మడుగు నర్సింహ డిమాండ్ చేశారు. నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణ కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, దాసరి లక్ష్మయ్య, గౌటి సత్తయ్య, పాక శేఖర్ , పెద్దమ్మల కృష్ణ, కొలిపాక వెంకటేష్ ,గులేని సత్తయ్య, పాలడుగు రవి, నర్సమ్మ, జయమ్మ ఉన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ..

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సామల భాస్కర్, ముంతాజ్ బేగం, గౌరవంతుల శ్రీనివాస్, స్వామి, భిక్షపతి, లక్ష్మి, సంధ్య, రమేష్ నరసింహ, వెంకటేష్, పాండు రాంనర్సయ్య, శ్రీకాంత్, మోహన్ దాస్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

భూదాన్‌పోచంపల్లి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం పట్టణ కేంద్రంలో సీపీఐయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల, పట్టణ కన్వీనర్లు మంచాల మధు, వడ్డేపల్లి యాదగిరి, సీపీఎం పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, నాయకులు కొమ్ము బాబు, బుగ్గ లక్ష్మయ్య, శ్రీరాములు, రాంరెడ్డి, శారద పాల్గొన్నారు.

తుర్కపల్లి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పోతరాజు జహంగీర్, తలారి మాతయ్య, అవుల కలమ్మ, గుండెబోయిన బలరాం, రాజు, రమేష్, శివ, నాగరాజు, లక్ష్మి, పోచమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.


భువనగిరిలో నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

చౌటుప్పల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాష, దాసు, వెంకటేశం, దేవయ్య, శివకుమార్, యాదయ్య, మదార్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగె సోములు కోరారు. నూతన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలకేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నకిరేకంటి రాము, కొల్లూరి నాగరాజు, నర్సింహ, గోరయ్య, యాదమ్మ, కవిత, ఉప్పలమ్మ, భారతమ్మ, స్వామి పాల్గొన్నారు.

మోత్కూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కూరెళ్ల నర్సింహ, సీఐటీయూ మండల కన్వీనర్ సామ శ్రీనివాస్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు ఎస్.కె.శ్రీను, నాయకులు కందుకూరి నర్సింహ్మ, చామకూరి వెంకన్న, కూరెళ్ల కృష్ణ, కూరెళ్ల రోశయ్య, జంగ సైదులు, ఆంజనేయులు, పరశురాములు, అన్నెపు శ్రీరాములు పాల్గొన్నారు.



మోత్కూరు : ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

వలిగొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పైళ్ల గణపతి రెడ్డి, నరసింహ, రాములు, ఎల్లమయ్య, జన్ని జంగయ్య, నరసింహ, వలయ్య, వీరస్వామి, అంజయ్య, తాళ్ల సత్తయ్య, లలిత, రేణుక పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం

బొమ్మలరామారం : కార్పొరేట్, పెట్టుబడుదారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తూ సంక్షేమాన్ని విస్మరిస్తుందని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ర్యాకల శ్రీశైలం అన్నారు. మండలంలోని మర్యాల గ్రామ చౌరస్తాలో కార్మికులు, రైతులతో కలసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, బాలయ్య, మణెమ్మ, పెంటమ్మ,లక్ష్మమ్మ, ఎల్లమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

ఆలేరురూరల్ : ఆలేరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 15వ విడత మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ ఉపేందర్‌రెడ్డి, ఏపీఓ ఆదిత్య, ఎంపిడీఓ సత్యాంజనేయ ప్రసాద్ హాజరయ్యారు. 2024-2025 సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. రూ. 16,335 రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనురాధ, ఏపీఓ అరుణకుమారి, టెక్నికల్ అసిస్టెంట్ రామచంద్రయ్య, మానస, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు. సమావేశానికి అధికారులు తప్పా కూలీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎవరూ హాజరు కాకపోవడం గమనార్హం.


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

సంక్షిప్త సమాచారం

చెక్‌పోస్టులు పెంచాలని వినతి

భువనగిరిటౌన్ : గోవుల అక్రమ రవాణా నియంత్రించేందుకు చెక్ పోస్ట్ లను పెంచాలని కోరుతూ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్ పట్టణ కన్వీనర్ నెమిలి నవీన్, బింగి భరత్ కుమార్, శ్రవణ్ ,గోపి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలు చేయాలని..

రాజాపేట : రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ పలువురు దివ్యాంగులు మంగళవారం డీడబ్ల్యూఓ నర్సింహ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు కొడిదెల నరేష్, గొల్లెన స్వామి, అనంతుల ఎల్లారెడ్డి, భువనగిరి నర్సింగరావు, ఎస్‌కే షబ్బీర్, ఇప్పల రమేష్ పాల్గొన్నారు.

కాలువ మరమ్మతు పనులు ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని పిలాయిపల్లి కాలువ మరమ్మతు పనులను మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ వెంకట్రావ్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, అంబరీష్‌రెడ్డి, పడమటి భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అందెల హరీష్, మాజీ ఎంపీటీసీ బందారపు సుమలత లక్ష్మణ్, సీపీఎం మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి, నాయకులు భూషణ్‌గౌడ్, దానయ్య, లక్ష్మిపతి, మహేశ్ పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

భూదాన్‌పోచంపల్లి : సామాజిక సేవతోనే సంతృప్తి కలుగుతుందని రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత, కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మున్సిపల్ కేంద్రంలోని కేవీటీ కోవెల భవనంలో కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ 36వ వార్షికోత్సవం, కర్నాటి వెంకటేశం 58వ జయంతిని నిర్వహించారు. అనంతరం నిరుపేద మహిళలకు బియ్యం పంపిణీ చేశారు. సే కార్యక్రమంలో క్లబ్ ప్రధానకార్యదర్శి ఏలే ఉమాశంకర్, సభ్యులు వలందాస్ మహేశ్, కొంక సతీష్, మహేశ్వరం వెంకటేశ్, తడక విష్ణు, సీత శ్రీనివాస్, గద్దం దేవికీనందన్, రాజారమేశ్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

మోత్కూరు : ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహ రెడ్డి అన్నారు. స్టాండర్డ్ షిటూరియో ఇంటర్నేషనల్ కరాటే డూ ఆధ్వర్యంలో మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కరాటే బెల్టుల గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. వివిధ స్థాయిలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కరాటే మాస్టర్లు పి.బాలరాజు, అన్నెపు వెంకటేలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జూడో మ్యాట్స్ దాత పల్లెర్ల వెంకన్న గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను మంగళవారం తహసీల్దార్ గణేష్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐ విజయసింహారెడ్డి, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ రాము పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

భువనగిరిటౌన్ : పట్టణ కేంద్రంలో కూలీల అడ్డాల వద్ద మంగళవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కూలీలకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వి.మాధవిలత , చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.జైపాల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌జి.శంకర్, న్యాయవాదులు ప్రకాష్ రెడ్డి, రాజశేఖర్, నాగరాజు, సాయి శ్రీనివాస్, రాంబాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరి : పట్టణంలోని విద్యానగర్, బంజారాహిల్స్, తారకరామనగర్, ప్రగతినగర్, పహిడీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా ఆయా ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ పట్టణ ఏఈ సాయికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ఆయా కాలనీల ప్రజలు సహకరించాలని కోరారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

చౌటుప్పల్ : సబ్సిడీపై అందజేసే జీలుగ విత్తనాలు సింగిల్‌విండో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని ఏఓ ముత్యాల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30కిలోల బ్యాగుకు రూ. 4,175 ఉండగా అందులో 50శాతం సబ్సిడీ మినహాయించి మిగతా సగం రైతు చెల్లించాలన్నారు. కావాల్సిన వారు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకుని సింగిల్ విండో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రామన్నపేట : రామన్నపేట వ్యవసాయ సహకార సంఘంలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎండీ ఎజాజ్‌అలీఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ పోగా 30కిలోల బస్తా ధర రూ 2137లు, 40 కిలో బస్తా ధర 2,510లకు విక్రయించనున్నట్లు తెలిపారు.

హోమ సమిధలు అందజేత


సమిధలను అప్పగిస్తున్న వద్లోజు వెంకటేష్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో నిర్వహించే శ్రీసుదర్శన నారసింహ హోమానికి, శివాలయంలో జరిపించే రుద్ర హోమం, చండీ హోమాలకు వినియోగించేందుకు సమిధలను గౌళికార్ నర్సింగ్ రాజ్ ద్వారా టీటీడీ లోకల్ అడ్వైజరీ మాజీ సభ్యుడు వద్లోజు వెంకటేష్ మంగళవారం అందజేశారు. గౌళికార్ నర్సింగ్ రాజ్ తండ్రి యాదగిరి దేవస్థానం రిటైర్డ్ ఈఈ గౌళికార్ కిషన్ జ్ఞాపకార్థం ఈ సమిధలను అందించినట్లు తెలిపారు. సుమారు 30 క్వింటాళ్లకు పైగా ఉన్న సమిధల్లో జువ్వి, మొదుగు, రాగి, మర్రి, సంద్ర, మామిడి వంటి సమిధలు ఉన్నాయని తెలిపారు.